రైతన్నకు కలుపు కష్టం



ఉండవెల్లి శివారులో మిరప పంటలో కలుపు తీస్తున్న కూలీలు

- పంట పొలాల్లో ఏపుగా పెరిగిన ఫైనం
- పెరిగిన కూలీల ఖర్చు
- దిగుబడి రాక ఇబ్బందుల్లో అన్నదాతలు

ఉండవెల్లి: యూరియా దొరక్క క్యూలైన్లలో నిల్చొని అవస్థలు ఒకవైపు అల్లాడుతున్న మరోవైపు ఇటీవల కురుస్తున్న వర్షాలతో పంట పొలాల్లో ఏపుగా పెరిగిన కలుపుతో నానా అవస్థలు పడుతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పెట్టుబడి పెరగడంతో పాటు కూలీ ఖర్చులు కూడా పెరుగుతున్నాయని వాపోతున్నారు.

21 వేల ఎకరాల్లో సాగు

మండల పరిధిలో సుమారు 21 వేల ఎకరాల్లో రైతులు సాగు చేపట్టారు. ముఖ్యంగా పత్తి, మొక్కజొన్న, ఉల్లిగడ్డ, మిరప పంటలను సాగు చేస్తున్నారు. ఇటీవల 15 రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంట పొలాల్లో కలుపు అమాంతం పెరిగిందని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఉల్లిపంటలో మాత్రమే కలుపు నివారించేందుకు గడ్డి మందు పిచికారీ చేస్తారు. మిగిలిన పంటల్లో కూలీల చేత కలుపు తీయాల్సి ఉంటుందన్నారు.

విపరీతంగా పెరిగిన కలుపు

ఈ సీజన్‌లో మండలంలో విస్తారంగా వర్షాలు కురవడంతో పంట పొలాల్లో గడ్డిజాతి మొక్కలతో పాటు తుంగ, గరిక విపరీతంగా పెరిగింది. పంటలకు వేసిన ఎరువుల బలాన్ని కలుపు మొక్కలే తీసుకుంటున్నాయని రైతులు వాపోతున్నారు. దీంతో దిగుబడి రాక అల్లాడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఎకరా పొలంలో కలుపు తీయాలంటే 20 నుంచి 25 మంది కూలీలు అవసరం ఉంటుందని, ఒక్కో కూలీకీ దాదాపు రూ.500 చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

యురియా దొరక్క అవస్థలు

ఒకవైపు కలుపు సమస్య మరోవైపు యూరియా దొరక్క అవస్థలు పడుతున్నట్లు రైతులు వాపోతున్నారు. ఒకవేళ యూరియా లభించిన కూలీలతోనే చల్లించాలంటున్నారు. కూలీల కొరతతో పాటు పెరిగిన కూలీ రేటుతో పెట్టుబడి ఖర్చులు భారమవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పనులు సాగడం లేదు..



ఉల్లి పంటలో కలుపు విపరీతంగా పెరిగింది. ఉల్లినాట్లు వేసినప్పటి నుంచి అధిక వర్షాలు కురుస్తుండడంతో పంట పొలాల్లో పనులు సాగడం లేదు. పెరిగిన కూలి రేటుకు తోడు కొరతతో ఇబ్బందులు పడుతున్నాం.

– రాముడు, ఉండవెల్లి

పత్తిలో అధికంగా



ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పత్తి పంటలో కలుపు అధికమైంది. దీంతో పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది. అధికారులు పంట నష్టపరిహారం కూడా రాదంటున్నారు. పంట పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది.

– నరేందర్ రెడ్డి, చిన్న ఆముదాలపాడు



చిన్నఆముదాలపాడులో కలుపు తీసున్న కూలీలు

క్లుప్తంగా

26న ఐలమ్మ విగ్రహావిష్కరణ

ఇటిక్యాల: మండలంలోని ఉదండాపురంలో ఈ నెల 26న శుక్రవారం తెలంగాణ సా యు ధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ నూతన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉన్న ట్లు గ్రామ రజక సంఘం సభ్యులు మంగళవా రం ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, రజక సంఘం, వివిధ సంఘాల నాయకులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.ఆవిష్కరణకు పెద్దఎత్తున నాయకులు, బహుజనులు, మేధావులు, విద్యావంతులు హాజరు కావాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాల పరిశీలన

మానవపాడు: మండల కేంద్రంతోపాటు గోకులపాడు, చెన్నిపాడు గ్రామాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను మంగళవారం హౌసింగ్ డీఈ నరేందర్ పరిశీలించారు. నిర్మాణాలను నాణ్యతతో వేగంగా చేయాలని సూచించారు. బేస్మెంట్ లెవల్‌లో నిర్మించిన లబ్ధిదారులకు బిల్లులు రూ. లక్ష వరకు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



అలంపూర్: కర్నూలులోని క్యాంప్ కార్యాలయంలో సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్‌ఓసీని ఎమ్మెల్యే విజయుడు మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. రాజోళికి చెందిన పన్నెగట్ల మెహమ్మద్ ఆవైస్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షల ఎల్‌ఓసీ మంజూరైనట్లు పేర్కొన్నారు.

ఇటిక్యాల: మండల పరిధిలోని మునగాలకు చెందిన గోపాల్‌రెడ్డికి రూ.60 వేలు విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సూర్యకాంతరెడ్డి, అనంతరెడ్డి, ఇబ్రహీం, మద్దిలేటి, శేషన్న, వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



మల్దకల్: ఎరువులు, విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ సంగీతలక్ష్మి దుకాణ దారులను హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో స్టాక్, పంపిణీ రిజిస్టర్లు పరిశీలించారు. యూరియా కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ రాజశేఖర్, ఏఈఓలు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

అయిజ: మండలంలోని చిన్నతాండ్రపాడులో మంగళవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు.. గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద 6 సెల్‌ఫోన్లు, రూ.15,730 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



అలంపూర్: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఉండవెల్లి ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. అలంపూర్ చౌరస్తా సమీపంలోని పుల్లూరు టోల్ ప్లాజా సమీపంలో బ్లూకోర్ట్ పోలీసులు రవి, అనిల్ మంగళవారం కర్నూలు వైపు నుంచి అలంపూర్ చౌరస్తా వైపు ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. కర్నూలు జిల్లా దిన్నెదేవరపాడుకు చెందిన బోయ మధు తుంగభద్ర నది నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను నింపుకొని అలంపూర్ చౌరస్తాకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక లారీ స్వాధీనం

మానవపాడు: మండల కేంద్రంలో జాతీయ రహదారిపై అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ చంద్రకాంత్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తాడిపత్రి నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఇసుక లారీకి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో మానవపాడు స్టేజీ సమీపంలో పట్టుకొని స్టేషన్‌కు తరలించామన్నారు. లారీ డ్రైవర్ జగదీష్, యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

అయిజ: జిల్లా కేంద్రంలో ఈ నెల 17న నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనభరిచిన విద్యార్థులను మంగళవారం మండలంలోని మేడికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు జగదీష్ మాట్లాడారు. విద్యార్థులు రాముడు, దేవి, శ్రీప్రసాద్, రాజేశ్వరి, జ్యోతి, సుజాత రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి 28 వరకు నిజామాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు తిమ్మారెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ నరసింహ తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ప్రైవేటు పాఠశాలకు నోటీసు

అయిజ: మండల కేంద్రంలోని బీజీఆర్ హైస్కూల్ నిర్వాహకులకు మంగళవారం ఎంఈఓ రాములు నోటీసు జారీ చేశారు. ప్రభుత్వం దస రా సెలవులు ప్రకటించినా సరే సోమవారం పాఠశాలను నిర్వహించినందుకు నోటీసు జారీ చేసినట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

మున్సిపాలిటీలో సమస్యలు పరిష్కరించాలి

అయిజ: మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలపై అధికారులు స్పందించాలని అఖిలపక్ష కమిటీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు అన్నారు. మంగళవారం మండలంలోని అఖిల పక్షం కమిటీ కార్యాలయంలో సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. పట్టణంలో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడించినా సరే చర్యలు తీసుకోవడం లేదన్నారు. కలెక్టర్ స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు జగపతిరెడ్డి, వెంకట్రాములు, ఆంజనేయులు, తాహేర్, మద్దిలేటి, శరణప్ప, భీమన్న, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆంజనేయులు

దుర్గంధంతో నానా అవస్థలు



సత్రం దారిలో అపరిశుభ్రంగా ఉన్న పరిసరాలు



సత్రం దారిలోని డ్రెయినేజీలో ఉన్న చెత్తా చెదారం

అలంపూర్: అలంపూర్ క్షేత్రంలోని నిత్య అన్నదాన సత్రం దారిలో దుర్గంధంతో నానా అవస్థలు పడుతున్నట్లు భక్తులు, స్థానికులు వాపోతున్నారు. నిత్యం వందల మంది ప్రజలు తిరిగే దారిలో మురుగు నిలిచి దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీబాలబ్రహ్మేశ్వర జోగుళాంబ అమ్మవారి క్షేత్రానికి వచ్చే భక్తులకు నిత్య అన్నదాన సత్రానికి ఇదే దారిలో వెళ్తుంటారు. ఉత్సవాల సందర్భంగా క్షేత్రానికి భక్తుల రద్దీ పెరుగుతున్న పారిశుద్ధ్య చర్యలు చేపట్టడం లేదని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రక్షణ గోడ పక్కన ఉన్న డ్రెయినేజీలో మురుగు నిలిచి ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి సత్రంలో దారిలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత



విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతున్న సీఐ రవిబాబు

అలంపూర్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు కట్టుదిట్టమైన భద్రత కల్పిస్తున్నట్లు అలంపూర్ సీఐ రవిబాబు అన్నారు. అలంపూర్ క్షేత్రంలో ఆలయాల పరిసరాలను సీఐ మంగళవారం పరిశీలించారు. శ్రీ బాలబ్రహ్మేశ్వరస్వామి, జోగుళాంబ అమ్మవారి ఆలయాల సముదాయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఉత్సవాల్లో సాధారణ రోజుల్లో 100 మంది, ప్రత్యేక రోజుల్లో 200 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీరితో పాటు సీసీఎస్, షీటీం, మఫ్టీలో పోలీసులు విధులు నిర్వహిస్తారన్నారు. ఉత్సవాల్లో ఆకతాయిలు, జేబుదొంగలు, అసాంఘీక శక్తులపై ప్రత్యేక నిఘా ఉందన్నారు. దశమి సందర్భంగా నిర్వహించనున్న తెప్పోత్సవం నాడు భారీగా బందోబస్తు ఉంటుందని పేర్కొన్నారు. అదే విధంగా క్షేత్ర సందర్శనకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు వేయాలని మంత్రికి వినతి

ఆత్మకూర్: మూలమళ్ల గ్రామానికి బీటీరోడ్డు వేయాలని మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరికి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రుల నివాస సముదాయంలో ప్రముఖ సామాజికవేత్త దేశాయి పద్మజారెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు మంత్రిని కలిసి సమస్యలు విన్నవించారు. ఆత్మకూర్ నుంచి మూలమళ్ల మీదుగా జూరాల ప్రాజెక్టుకు 2016లో రోడ్డు మంజూరైనా నేటికీ మోక్షం లభించ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని కబడ్డీ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణిస్తున్నారని, వారిని ప్రోత్సహించేందుకు క్రీడామైదానం కోసం ఎకరన్నర స్థలాన్ని విరాళంగా అందించినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో సత్యన్న, వెంకట్రాములు, నరసింహులు, రాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

అన్యాక్రాంత భూమిని కాపాడండి

ధరూరు: మండల పరిధిలోని నీలహళ్లిలో శ్రీఆంజనేయస్వామి ఆలయానికి చెందిన దేవాదాయ శాఖ ఇనాం భూమి ఆక్రమణకు గురైందని గ్రామస్తులు మంగళవారం ఆందోళన చేశారు. కబ్జాకు గురైన భూమిని తిరిగి ఆలయానికి చెందే విధంగా చూడాలని కోరారు. ఈ సందర్భంగా నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగ్లల రంజిత్‌కుమార్ మాట్లాడారు. సర్వే నంబర్ 355లోని 5 ఎకరాల 16 గుంటల భూమి 1963 నుంచి దేవాలయం ఇనాం భూమిగా కొనసాగుతుందన్నారు. ప్రస్తుతం రాజకీయ నాయకుల అండదండలతో కబ్జా కోరులు కాజేయాలని కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దేవస్థానం భూమిని రియల్ ఎస్టేట్‌గా మారుస్తూ కబ్జాకు పాల్పడడటమే కాక గ్రామ ప్రజలను వంచనకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. పలువురు నాయకులు ఏకమై రాత్రికి రాత్రే పొలాన్ని చదును చేయించి ఆక్రమణకు పాల్పడ్డారన్నారు. ఇప్పటికే ఈ భూమి వ్యవహారం కోర్టు పరిధిలో ఉందని, సంబంధం లేని కిష్టాచారిపై దత్తపుత్రుడిగా చిత్రీకరించి కొత్త నాటకానికి తెరలేపారన్నారు. కలెక్టర్ స్పందించి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకుడు వెంకట్రాములు, మండల అధ్య క్షుడు గోవిందు, మునెప్ప, అడివి ఆంజనేయులు, రాము, ఇస్మాయిల్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.



ఆక్రమణకు గురైన భూమిని పరిశీలిస్తున్న నాయకులు, ప్రజలు

జీఎస్టీ తగ్గింపుతో ఆర్థిక ఊరట

గద్వాల: జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక ఊరట ఇచ్చినట్లు అయిందని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే స్నిగ్ధారెడ్డి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో ఓ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 374 వస్తువులపై జీఎస్టీ తగ్గించడం ద్వారా సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు పెద్దఎత్తున ఊరట లభించినట్లు అయిందన్నారు. ఇదే విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం కల్పించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామాంజనేయులు, రవికుమార్, బండల వెంకట్రాములు, అక్కల రమాదేవి, రజకజయశ్రీ, సుదర్శన్‌చారి, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీకే స్నిగ్ధారెడ్డి

అధ్వానంగా ప్రధాన రోడ్లు

రాజోళి: మండల పరిధిలో ప్రధాన రోడ్లు అధ్వానంగా ఉన్నాయని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ రెడ్డి అన్నారు. మంగళవారం రాజోళి– వడ్డేపల్లి ప్రధాన రోడ్డు దుస్థితిపై ఆయన మాట్లాడారు. మండల కేంద్రం నుంచి వడ్డేపల్లికి నూతనంగా రోడ్డు వేశారని అది కూడా గుంతలు పడి దెబ్బతిందన్నారు. అధికారుల స్పందించి నాణ్యతతో రోడ్లు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శశికుమార్, గోవిందు రాజులు, తిరుమలేశ్ తదిదరులు పాల్గొన్నారు.



ధ్వంసమైన రోడ్డును పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

వేద స్వరూపిణి.. గాయత్రి



శాంతినగర్‌లో సామూహిక కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు



ధరూరులో గాయత్రిదేవిగా అమ్మవారి దర్శనం

సాక్షి నెట్‌వర్క్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు అమ్మవారు గాయత్రి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాల్లో అమ్మవారికి కుంకుమార్చన పూజలు, ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.

❖ ధరూరు మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవిగా పూజలందుకున్నారు. ఈ సందర్భంగా కుంకుమార్చన, కలశ, గణపతి పూజ, బిల్వార్చన వంటి క్రతువులు నిర్వహించినట్లు అర్చకులు కిష్టాచార్యులు తెలిపారు.

❖ అయిజ మున్సిపాలిటీ, మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పలు ఆలయాల్లో భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

❖ ఎర్రవల్లి మండలంలో శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగాయి. బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో దుర్గామాత మంగళగౌరీగా, ఎర్రవల్లి శివాంజనేయస్వామి ఆలయంలో దుర్గామాత గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

❖ శాంతినగర్ మండల కేంద్రంలోని కోయిల్‌దిన్నె రోడ్డులో వెలసిన శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రిదేవికి ఆలయ కమిటీ చైర్మన్ రావూరి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో అభిషేకాలు నిర్వహించారు. గాయత్రి మంత్రం ఉపాసన చేశారు. సామూహిక కుంకుమార్చన పూజలు గావించారు. సీతారామాలయంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

❖ మల్దకల్ మండల కేంద్రంలోని కన్యకాపరమే శ్వరి ఆలయంలో గాయత్రిదేవి అలంకరణలోఅమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ఆదిశిలా క్షే త్రంలో గాయిత్రిదేవిగా అమ్మవారు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బాదం శ్రీనివాసులు, మనసాని నాగరాజు, దామ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

❖ ఉండవెల్లి మండల కేంద్రం, కంచుపాడు, ప్రాగటూరు గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి.

❖ మానవపాడు మండల కేంద్రంలోని పలు ఆలయాల్లో దసరా నవరాత్రుల సందర్భంగా అమ్మవారు గాయత్రిదేవిగా దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

❖ ఇటిక్యాల మండల పరిధిలోని పెద్దదిన్నే వేంకటేశ్వరస్వామి ఆలయం, చాగాపురం భవానీ యూత్, షాబాద్ శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గామాతకు అర్చకులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు.

❖ రాజోళి అంబాభవానీమాత ఆలయంలో అమ్మవారికి మహిళలు ప్రత్యేక కుంకుమార్చన, నైవేద్య సమర్పణ చేశారు. భక్తుల తరఫున అర్చకులు అమ్మవారికి మంగళహారతి, తీర్థప్రసాదాలు అందజేశారు.



రాజాపురంలో పూజలో పాల్గొన్న భక్తులు



బీచుపలి ఆంజనేయస్వామి ఆలయంలో..



శాంతినగర్‌లో దర్శనమిస్తున్న అమ్మవారు



మల్దకల్ మార్కేండేయ స్వామి ఆలయంలో..



మానవపాడులో..



అయిజలో..



చాగాపురంలో..



ఉండవెల్లిలో..



మల్దకల్‌లో..



శాంతినగర్‌లో అమ్మవారిని దర్శించుకొంటున్న భక్తులు